
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 6 ఫిబ్రవరి 2025 | 5



8 నుంచి ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

వార్త..7లో



పుష్పక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

వైభవంగా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహుని దివ్యకల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజైన బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గరుడ పుష్పక వాహనంపై స్వామి వారు ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి విచ్చేశారు. రాత్రి 7 గంటలకు పుష్పక వాహనంపై గ్రామోత్సవం జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. - రాజోలు

సంప్రదాయ నృత్య ప్రదర్శన..



నన్నయలో ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవం

హాజరైన ఎమ్మెల్యే గోరంట్ల, వీసీ

400 మంది గిరిజన కళాకారులు, 1500 మంది ప్రతినిధులు హాజరు - రాజోలు

ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో

గుండెపోటుకు వైద్య సేవలు

సూపరింటెండెంట్ సాయిశృతి



ముమ్మిడివరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వంటి విపత్కర పరిస్థితుల్లో సకాలంలో వైద్య సేవలు అందినప్పుడే ప్రాణాన్ని నిలబెట్టుకోగలుగుతారని ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ బి.సాయిశృతి పేర్కొన్నారు. గుండెపోటుకు గురైన సమయంలో ముమ్మిడివరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు ఉన్నట్టు సూపరింటెండెంట్ సాయిశృతి తెలిపారు. గుండె నొప్పి రోగులకు అప్ అండ్ స్పోక్ విధానంలో రూ.40వేలు విలువైన ఇంజక్షన్‌ను అవసరమైన రోగులకు ఉచితంగా అందజేయనున్నట్టు ఆమె తెలిపారు. ఎవరికైనా గుండె నొప్పి వస్తే ఆసుపత్రిలో వైద్యులు వారికి ఈసీజీ తీసి యాప్ లోను, వైద్య గ్రూపులోను అప్‌లోడ్ చేస్తామని, అది పెద్దాసుపత్రికి(హబ్) పంపిస్తామన్నారు. వాటిని పరిశీలించిన ఉన్నత వైద్య నిపుణులు ఆయా రోగులకు ఇంజక్షన్ అవసరమో కాదో నిర్ధారణ చేస్తారన్నారు. అవసరమైన వారికి వెంటనే స్థానిక ఆసుపత్రి వైద్యులే ఇంజక్షన్ ఇస్తారన్నారు.

గంజాయికి బానిసలై.. చోరీల బాట

ముగ్గురు యువకులు మరో ముగ్గురు బాలల నేరాలు 7లో
చోరీ సొత్తు స్వాధీనం

ఏలూరు రేంజ్ పరిధిలో 7లో
గంజాయి రవాణా తగ్గుముఖం: ఐజీ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు విస్తృత స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్సీ గెలుపును భుజాన వేసుకుని పనిచేస్తున్నారు. ఆయా పార్టీల నుంచి ఆదేశాలు స్పష్టంగా ఉండడంతో కూటమి అభ్యర్థి విజయం కోసం కలిసికట్టుగా పనిచేస్తున్నారు. అయితే నియోజకవర్గ కేంద్రాల్లో కూటమి నేతలు సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పట్టభద్రులైన ఓటర్లను ప్రభావితం చేసే ప్రణాళికలు ఇంకా అమలుకు నోచుకోకపోవడం చర్చనీయాంశమైంది.

కూటమి నేతలు కలిసికట్టుగా..

● (అమలాపురం-ఆంధ్రజ్యోతి)



పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి సమావేశాలు
- రంగంలోకి దిగిన ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు
- రాజోలు, గన్నవరం నియోజకవర్గాల్లో కూటమి నేతలతో భేటీ
- నేరుగా ఓటర్లను కలిసి ప్రణాళికలు అమలు చేయాలి
- వేడెక్కుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

రంగంలోకి మంత్రి అచ్చెన్నాయుడు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఎన్నికల రంగంలోకి దిగి పార్టీ శ్రేణులను చైతన్యవంతుల్ని చేసేందుకు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహించే రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహించారు. కూటమి నేతలతో అచ్చెన్నాయుడు సమావేశమై పార్టీ శ్రేణులకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహ ప్రణాళికలు వివరించారు. ఇక నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, కూటమి నేతలతో విస్తృత స్థాయిలో సమావేశాలు ఏర్పాటుచేసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలంటూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అయితే ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో పర్యటించి టీడీపీతో పాటు జనసేన, కూటమి శ్రేణులను చైతన్యవంతుల్ని చేస్తున్నారు.

ప్రతీ 30 ఓట్లకు ఒక నేత..

ఎన్నికలకు 21 రోజులు గడువు ఉన్నందున ప్రతీ నేత 30 ఓట్లను లక్ష్యంగా చేసుకుని నాలుగైదు సార్లు ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించడం ద్వారా కూటమి అభ్యర్థి రాజశేఖర్ గెలుపు సునాయాసమవుతుందని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీలో గుర్తింపు కావాలన్నా, సముచిత పదవులు రావాలన్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులచే ఓట్లు వేయించే నేతలకే తగిన గుర్తింపు ఉంటుందని, దీని దృష్ట్యా ప్రతీ కార్యకర్త ఎన్నికల కోసం పనిచేయాల్సిందిగా అచ్చెన్నాయుడు పదేపదే సూచించారు. ఇక నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారని, పార్టీ ప్రణాళికలను కిందిస్థాయిలోకి తీసుకువెళ్లి అమలు చేసేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారశైలి చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ కూటమి నేతలు పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

వ్యూహరచన

ఇప్పటికే నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో పాటు పార్టీ నియమించిన పరిశీలకులు సమావేశాలకు హాజరవుతున్నారు. ఇక ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున ఈ నెల 10న అభ్యర్థి రాజశేఖర్ నామినేషన్ కార్యక్రమం ఉంటుందని, ఆ తర్వాత ప్రతీ కార్యకర్త పట్టభద్రుల ఓటర్ల జాబితా తీసుకుని వారి ఇళ్లకు వెళ్లి వారిని ఆకట్టుకునే విధంగా ప్రచారం చేయాలని ముఖ్య నాయకులు కోరుతున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిగిలిన అభ్యర్థులు నేరుగా పట్టభద్రులతో సమావేశమై ఓట్లు అభ్యర్థిస్తున్నారు. టీచర్ యూనియన్లతో భేటీ నిర్వహించి వారి ఓట్లను మూకుమ్మడిగా పొందేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. దాంతో జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి మొదలైంది.

రెండో రోజు 5 వేల మందికి దర్శనం

● ఆర్డీవో మాధవి

అంతర్వేది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యతిరు కల్యాణ మహోత్సవాల్లో రెండో రోజు బుధవారం స్వామివారిని 5వేల మంది భక్తులు దర్శించుకున్నారని అమలాపురం ఆర్డీవో కె.మాధవి అన్నారు. పర్యాటక భవనం వద్ద ఏర్పాటుచేసి పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెండో రోజు స్వామివారికి ఉదయం పంచామృతాలతో అభిషేకం, 10 గంటలకు నారసింహ సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు గరుడ పుష్పకవాహనం, 7 గంటలకు పుష్పక వాహనంపై గ్రామోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. అత్యధికంగా భక్తులు గ్రామోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాల్లో భక్తులకు తాగునీరు, భోజన వసతిని వివిధ సత్రాల ద్వారా సంపూర్ణంగా కల్పించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్వామివారిని దర్శించుకుని కల్యాణోత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకుని సురక్షితంగా ఇంటికి చేరుకోవాలన్నారు. కల్యాణోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 7వ తేదీ శుక్రవారం స్వామివారి దివ్యతిరు కల్యాణోత్సవాలను భక్తులు తిలకించేందుకు ఆలయ ప్రాంగణమంతా ఉదయం 10 గంటలకు టిక్కెట్లు విక్రయిస్తారన్నారు. టిక్కెట్ ధర రూ.200 ఉంటుందన్నారు. తీర్థ మహోత్సవ ఏర్పాట్లలో భాగంగా కమాండ్ కంట్రోల్ రూమును పరిశీలించారు. కల్యాణమండపం వద్ద ఉన్న గెస్ట్‌హౌస్, సముద్ర తీరంలో పుణ్యస్నానాల వద్ద ఏర్పాటుచేసి వైర్‌లెస్ మైక్ సిస్టమ్‌ను చెక్‌చేసి మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ రూముకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబరు 08862 243500కు ఫోన్‌చేసి సంప్రదించి పరిష్కారాలు పొందవచ్చునని ఆమె తెలిపారు. అలాగే డ్రోన్, సీసీ కెమెరాల పనితీరును టెక్నికల్ టీమును అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, సూపరింటెండెంట్ పి.విజయసారథి, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు, రాజోలు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పినిశెట్టి బుజ్జి, వైస్‌చైర్మన్ ఆకన బాబ్జినాయుడు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఉండపల్లి అంజి, రావూరి నాగు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లపై నిర్లక్ష్యమేల

- రూ.4 కోట్ల బకాయిలు వసూలు చేసేది ఎప్పుడు
- సమన్వయ లోపంతోనే జాప్యం
- రూ.3.68 కోట్ల మిగులు బడ్జెట్ ఆమోదం
- వాడివేడిగా అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్



చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

అమలాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయల మేర బకాయిలు ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికార, విపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.4 కోట్ల మేర బకాయిలు ఉన్నప్పటికీ ఎందుకు స్పందించడం లేదని గత సమావేశంలోనే అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రశ్నించినా ఇంత వరకు కనీస ప్రగతి కూడా చూపించని తీరుపై మండిపడ్డారు. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపంతోనే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అధికార పక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర పేర్కొన్నారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన బుధవారం జరిగింది. మార్కెట్ పాట పాడుకున్న వారు ఇంకా ఎంత బకాయి ఉందని కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు ప్రశ్నించగా రూ.6లక్షల మేర బకాయి ఉన్నట్టు ఆర్వో శ్రీలక్ష్మి తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 2023-24 సంవత్సరంలో రూ.9.63 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా రూ.9.55 లక్షలు వసూలు చేసినట్టు టౌన్ ప్లానింగ్ అధికారి రాణి సంయుక్త వివరించారు. ట్రేడ్ లైసెన్సుల్లో జరుగుతున్న లోపాలను సభ్యులు ప్రశ్నించారు. 2018లో గెజిట్‌లో ప్రకటించిన రేట్లనే నేటికీ అమలు చేయాల్సి వస్తుందని కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు వివరించారు. ప్రస్తుతం 912 ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయని చెప్పారు. రూ.10లక్షల వరకు బకాయిలు ఉన్నట్టు తెలిపారు. బకాయిదారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి 2016 నుంచి రూ.21.70 లక్షలు బకాయి ఉందని, 535 ట్రేడ్ లైసెన్సులు లేనివి గుర్తించామన్నారు. 280 షాపులు మూతబడి పోయాయన్నారు. బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని గొవ్వాల రాజేష్ సూచించారు. సర్క్యులర్ బజార్‌తో సహా మార్కెట్‌లోని 104 షాపులకు సంబంధించి రూ.1.03 కోట్లు ఆదాయం వస్తుందని చెప్పగా ఐసీఐసీఐ బ్యాంకు కోసం ఇచ్చిన షాపుల నుంచి ఎన్ని నెలల బకాయిలు వసూలు చేయాలని నాగేంద్ర ప్రశ్నించారు. 12 నెలలకు గాను రూ.11.08 లక్షలు బకాయిలు ఉన్నట్టు వివరించారు. వీటితో పాటు రూ.89 లక్షల మేర బకాయిలు ఉన్నాయని ఆర్వో వివరించారు. సర్క్యులర్ బజార్‌లోని 34 షాపులకు సంబంధించి లీజుకు తీసుకున్న వారు సాల్వెన్సీల డిపాజిట్లు ఇవ్వడం లేదని, రూ.58 లక్షల వరకు బకాయిలు ఉన్నట్టు తెలిపారు. అటువంటి షాపులను ఖాళీ చేయించడం గానీ, సీల్ వేయడం గానీ ఎందుకు చేయడం లేదని సభ్యులు మండిపడ్డారు. తాము బకాయిల వసూళ్ల కోసం వెళ్తే కొందరు కౌన్సిలర్లు ఫోన్లు చేసి వారికి వత్తాసు పలుకుతుండడంతో వెనుదిరగాల్సి వస్తుందని ఆర్వో ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు బకాయిలు ఉండగా ఈ బడ్జెట్ ఎందుకని సభ్యులు ప్రశ్నించారు. పట్టణంలో పెద్ద పెద్ద అపార్టుమెంట్లకు నీటి పన్ను కింద రూ.210 మాత్రమే మినిమం చార్జీ వసూలు చేసే తీరును ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ప్రశ్నించారు. అపార్టుమెంట్లకు సంబంధించి ఎన్ని మీటర్లు పనిచేయడంలేదని అడగ్గా 68 మీటర్లు పనిచేయడం లేదని వివరణ ఇచ్చారు. సాధారణ పౌరుల వద్ద నుంచి వసూలు చేసే నీటి పన్ను ఎక్కువగా ఉంటుందని, అపార్టుమెంట్ల వద్ద తక్కువగా వసూలు చేయడాన్ని ప్రశ్నించారు. కుళాయి లేకుండానే నీటి పన్ను కట్టాల్సిన దుస్థితి వచ్చిందని తన ఉదంతాన్ని టీడీపీ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి వివరించారు. వాటరు ట్యాక్సు అంశంపై కౌన్సిలర్లు బండారు గోవిందు, కొల్లాటి దుర్గాబాయి మాట్లాడారు. ఈ ఏడాది ఇప్పటివరకు 28 శాతం మాత్రమే వాటరు ట్యాక్సు కింద వసూలైందని కమిషనర్ రాజు పేర్కొన్నారు. వాటరు ట్యాక్సుకు సంబంధించి రూ.2.30 కోట్లు బకాయిలు ఉండగా రూ.1.97 కోట్లు ఇంకా వసూలు చేయాల్సి ఉన్న పరిస్థితిని కమిషనర్ వివరించగా అసలు ఈ బకాయిలను ఎప్పటికి వసూలు చేస్తారని కౌన్సిలర్ యేడిద శ్రీను, రాజేష్ ప్రశ్నించారు. ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను బకాయిలు రూ.2.25 కోట్లు ఉండడం ఏమిటని నాగేంద్ర ప్రశ్నించారు. వీటితో పాటు గతంలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ కింద వసూలు చేసిన రూ.10 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. వీటితో పాటు ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సిన బకాయిలపై కూడా దృష్టి సారించాలన్నారు. దోమల బెడద, జనరేటర్ ఆయిల్ ఖర్చు తదితర అంశాలపై కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, పిండి అమరావతి తదితరులు ప్రశ్నించారు. నెలాఖరు నాటికి పన్నుల వసూళ్లపై పూర్తిస్థాయి దృష్టి సారించి వసూలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

రూ.3.68 కోట్లతో మిగులు బడ్జెట్ ఆమోదం..

అమలాపురం పురపాలక సంఘానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.14,97,42,468 ఉండగా వివిధ పద్దుల కింద ఆదాయం రూ.46,95,58,500 రాగా ఖర్చుల కింద రూ.53,09,35,500 కాగా రూ.8,83,65,468 మిగులు ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.8,83,65,468 ఉండగా వివిధ పద్దుల కింద ఆదాయం రూ.54,06,06,000. వివిధ పద్దుల కింద ఖర్చు రూ.59,20,92,000 కాగా రూ.3,68,79,468 మిగులు బడ్జెట్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.



వివిధ సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న కౌన్సిల్ సభ్యులు

కూటమి ప్రభుత్వ ప్రణాళికలు పట్టభద్రులకు వివరించాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న నేతలు

పి.గన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి, భవిష్యత్తుకు భరోసా దొరుకుతుందని పట్టభద్రులకు చెప్పాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు కూటమి నాయకులను కోరారు. రాష్ట్రంలో ఏడు మాసాల్లో జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై వివరించి పట్టభద్రులు ఓట్లు అభ్యర్థించాలని వివరించారు. పి.గన్నవరం జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో రూ.1300 కోట్లతో రహదారుల అభివృద్ధి జరిగిందన్నారు. వేసవి తర్వాత పాఠశాలలు తీసే సమయానికి తల్లికి వందనం కింద రూ.15 వేలు నగదును విద్యార్థుల తల్లుల వ్యక్తిగత ఖాతాల్లోకి బదిలీ చేస్తామన్నారు. మాజీ సీఎం జగన్ తరహాలో కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసే ప్రసక్తి లేదని కేంద్ర ప్రభుత్వం 3వ దఫాలో రైతులకు ఇచ్చే భరోసాతో పాటు త్వరలోనే రాష్ట్రం నుంచి అన్నదాత సుఖీభవ పేరుతో రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమ చేస్తామన్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు రెండు నెలలు మత్స్యకారులకు వేట నిషేధం ఉంటుందని ఆ సమయానికి ముందే కూటమి ప్రభుత్వం రూ.20 వేలు చెల్లిస్తుందని చెప్పారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.1,75,000 కోట్లు కేటాయించిందని కూటమి పలుకుబడి ఉపయోగించి నిధులు తెచ్చుకోవచ్చునని చెప్పారు. 2025 మార్చిలో జలజీవన్ మిషన్ పథకం ముగుస్తుందని సీఎం, డిప్యూటీ సీఎం విజ్ఞప్తితో 2028 వరకు పథకాన్ని పొడిగిస్తూ కేంద్రం జీవో విడుదల చేసిందన్నారు. త్వరలోనే రాష్ట్రానికి భారీ పెట్టుబడులతో పరిశ్రమలు రాబోతున్నాయని దీంతో ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు సంబంధించి 20 లక్షలకు పైగా ఉద్యోగాలు వస్తాయన్నారు. కోనసీమలో 60 వేల పట్టభద్రుల ఓట్లు ఉన్నాయన్నారు. ప్రతి 30 మంది ఓటర్లకు ఒక నమ్మకమైన కార్యకర్తను ఎన్నుకుని రాజశేఖర్ విజయానికి కష్టపడి పనిచేయాలన్నారు. ఈనెల 10వ తేదీన ఏలూరులో పేరాబత్తుల రాజశేఖర్ నామినేషన్ దాఖలు చేయనున్నారని టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందని కూటమి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని అచ్చెన్నాయుడు కోరారు. ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, దాట్ల సుబ్బరాజు, వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు తదితరులు మాట్లాడుతూ రాజశేఖర్‌ను గెలిపించి కూటమి ప్రభుత్వానికి గిఫ్ట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. తొలుత పలువురు రైతులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందించారు. సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోళ్ల వెంకటప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు షేక్ సుభాన్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఆకుల రామకృష్ణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, మట్టపర్తి రామకృష్ణ, జాలెం శ్రీనివాస రాజా, చొల్లంగి సత్యనారాయణమూర్తి, శేరు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పేరు ప్రస్తావించకుండా ప్రసంగమా?

జనసేన నాయకుల అసంతృప్తి

మంత్రి అచ్చెన్నాయుడు ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేరు ప్రస్తావించకపోవడంపై జనసేన నేతలు అభ్యంతరం తెలిపారు. జనసేన ఎమ్మెల్యే ఉన్న ప్రాంతంలో సమావేశం నిర్వహిస్తూ పవన్‌కల్యాణ్ పేరు ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. దీంతో అచ్చెన్నాయుడు కల్పించుకుని జనసైనికులు అడిగిన ప్రశ్నలో తప్పులేదని చెబుతూ పవన్‌కల్యాణ్ పేరు ప్రస్తావిస్తూ జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గురించి మళ్లీ వివరించారు. అయితే టీడీపీ నాయకులు కల్పించుకుని ప్రతి దానికి గొడవలు పెట్టుకుంటున్నారని జనసేన నేతలను అనడంతో ఇరుపార్టీల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. దీంతో సమావేశాన్ని తొందరగా ముగించుకుని అచ్చెన్నాయుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే, స్థానిక నాయకులు కల్పించుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.





గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, తదితరులు , ఆలయంలో కొలువుదీరిన అష్టలక్ష్మీ విగ్రహాలు

వైభవంగా స్వామివారి గ్రామోత్సవాలు

- అంతర్వేదిలో కొనసాగుతున్న కల్యాణోత్సవాలు
- గరుడ, పుష్పక వాహనాల పై ఊరేగిన స్వామివారు
- ఆలయంలో ప్రత్యేక పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పెద్దసంఖ్యలో భక్తుల రాక





ఏర్పాట్లపై ఆలయ అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఐజీ అశోక్‌కుమార్

అంతర్వేది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మితమైన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చకస్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరి కాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామి- అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించగా ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు పుష్పకవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. అనంతరం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కేరళ డప్పులతో వినూత్నరీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కుమారరామ గోపాల రాజా బహద్దూర్, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, నల్లా సత్య కిరణ్ ప్రసాద్, వలవల రాంబాబు, ఉప్పుగంటి నాగ మల్లేశ్వరరావు (దత్తుడు), పోతురాజు వెంకటకృష్ణ, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, వనమాలి మూలాస్వామి, కూటమి శ్రేణులు, అర్చకులు, వాహనకారులు, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు, పి.గన్నవరం, రాజోలు డెల్టా చైర్మన్లు గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, నాయకులు ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, పోతురాజు కృష్ణ కొండ కిషోర్, వీర మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో భాగంగా నేడు..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటల నుంచి 7 గంటల వరకు స్వామివారి తిరువారాధన, ఆర్జిత అభిషేకం, బాలబోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హంస వాహన సేవ, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణ, రాత్రి 7 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

పటిష్ఠ భద్రతా చర్యలు

అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ బుధవారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులచే మహదాశీర్వచనం జరిపించారు. అనంతరం కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు బయట కల్యాణం అంతర్వేది పుణ్యక్షేత్రంలో జరుగుతున్నందున 1600 మంది పోలీసు యంత్రాంగం శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, స్వామివారి తెప్పోత్సవాల్లో ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమైందన్నారు. కమాండ్ కంట్రోల్ రూము, వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తీర్థ మహోత్సవాల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ బీ.కృష్ణారావుతో కలిసి కల్యాణ మండపం, భక్తుల దర్శన క్యూలైన్, రథం రోడ్డు, పార్కింగ్ తదితర తీర్థ మహోత్సవ ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం కల్యాణ మండపం వద్ద ఎంతమంది భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు టికెట్లు కేటాయించారని ఆలయ అధికారులను అడగ్గా సూపరింటెండెంట్ పి.విజయసారథి మాట్లాడుతూ 1500 టికెట్లను సాధారణ భక్తుల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వన్‌వే రూటు, రవాణా సౌకర్యం, ఎల్‌ఈడీ స్క్రీన్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్,సీఐలు నరేష్‌కుమార్, భీమరాజు, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అడవితల్లి ముద్దుబిడ్డలు .. ఆదివాసీలు

- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- 'నన్నయ'లో ఘనంగా ప్రారంభమైన జాతీయ గిరిజన మహోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి సంస్కృతీ వైభవాన్ని కాపాడుతున్న ఆదివాసీలు అడవి తల్లి ముద్దుబిడ్డలు అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనికి ఎమ్మెల్యే గోరంట్ల, వర్సిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో గిరిజనులకు ఎన్టీఆర్ అందించిన సేవలను గుర్తుచేశారు. గిరిజన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ పొందాలని సూచించారు. వీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాలోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా నన్నయ వర్సిటీ ఆవిర్భవించిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు అందరికీ తెలియాలనే ఉద్దేశంతో ఏడాదికొకసారి ఓ విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిభాస్కర్, జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణునాయక్ మాట్లాడుతూ అడవిబిడ్డలుగా ఉన్న గిరిజనుల జీవనవిధానం ఒక ప్రత్యేక శైలిలో ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి 1500 మంది ప్రతినిధులు, 400 మంది కళాకారులు హాజరైనట్టు అక్కులప్పనాయక్ తెలిపారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజన కళాకారులు ధింసా, లంబాడీ, జానపద నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. తొలుత వర్సిటీ చాళుక్యద్వారం నుంచి ఆడిటోరియం వరకు సాంప్రదాయ నృత్యప్రదర్శనలతో ఆదివాసీ కళాకారులు భారీ ప్రదర్శన నిర్వహించారు.

కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు విష్ణు, దొర, రాజకుమార్ రెడ్డి, భగవాన్, వెస్లీ, రఘు, జానపద కళాకారుడు భిక్షునాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మధులత, ఉపాధ్యక్షులు హేమలత, తెలంగాణ టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీ చాళుక్య ద్వారం నుంచి సంప్రదాయ నృత్యాల ప్రదర్శన

పాలిటెక్నిక్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో
'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జనవరి 28, 29 తేదీల్లో జరిగిన 27వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో కాకినాడ జిల్లా గండేలపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థులు ఐదు పతకాలు సాధించారని ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి బుధవారం తెలిపారు. బాలుర విభాగంలో కె.సాంబశివరావు షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మెడల్, జి.అవినాష్‌కుమార్ 200 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్, బాలికల విభాగంలో వీఎల్ఎస్ కృష్ణతులసి షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మెడల్, ఎస్‌కే సబీహా చదరంగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. మార్చిలో బెంగళూరులో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌కు అర్హత సాధించారు. విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన పీడీలు సీహెచ్ మురళీ మోహన్, కె.శేఖర్‌రెడ్డిను సతీష్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై పోలీసులకు శిక్షణ



డ్రోన్ల వినియోగంపై శిక్షణను పరిశీలిస్తున్న కాకినాడ ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): డ్రోన్లను ఏవిధంగా వినియోగిస్తే సత్ఫలితాలను సాధించవచ్చో కాకినాడ జిల్లా వ్యాప్తంగా 97 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బుధవారం ఎస్పీ మాట్లాడుతూ త్వరలో ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా డ్రోన్లను ట్రాఫిక్ నియంత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో, ఊరేగింపులు, బహిరంగ సభలు, జాతరలు, పండుగుల, ఉత్సవాల్లో ఉపయోగించడం.. మరీ ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్, బహిరంగ మద్యపానం, జూదాలు, నాటుసారాయి పట్టుకోవడంలో ఉపయోగిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో కొంతమందితో డ్రోన్ ఆపరేట్ చేయించి వారి శిక్షణ సామర్థ్యాన్ని పరిశీలించారు. శిక్షణ పొందిన వారిని ఆయా స్టేషన్లలో డ్రోన్‌లు ఉపయోగించి విధులు నిర్వర్తించడానికి ఉపయోగించనున్నారు.

బెండపూడిలో ప్రకృతి
సాగు విధానంపై అధ్యయనం

- జీవామృతాల తయారీని పరిశీలించిన శ్రీలంక రైతుల బృందం



బెండపూడిలో జీవామృతం తయారీని పరిశీలిస్తున్న శ్రీలంక బృందం

తొండంగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అధ్యయనం చేసేందుకు వచ్చిన శ్రీలంక రైతుల బృందం బుధవారం తొండంగి మండలం బెండపూడి విచ్చేశారు. తేజ అరవింద్ అనే రైతు పొలాన్ని రత్నశ్రీ, ప్రియదర్శిని సికురా జపతి, హర్షలాసంత, తిలక్ చందన, అనోమ సంజీవని, హసాంక పరిశీలించారు. 30 ఎకరాల్లోని కొబ్బరి తోటలో అంతర పంటలుగా సాగవుతున్న కోకో, వక్క, అరటిలను చూసి అబ్బురపడ్డారు. తేమ కోసం, భూమి సత్తువ కోసం నవధాన్యాల పచ్చిరొట్టను పెంచుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పూర్తి ప్రకృతి విధానంలో తోటలోనే అవసరమైన సేంద్రియ ఎరువుల తయారీని చూశారు. జీవామృతం, బీజామృతం తయారీ విధానాన్ని రైతును అడిగి తెలుసుకున్నారు. వీటి వినియోగంతో సాగు ఖర్చు ఏ మేరకు తగ్గుతుందో వివరంగా అడిగారు. తోటకు డ్రిప్ ద్వారా జీవామృతాన్ని అందించడం అద్భుతమని, ఇప్పటివరకు తాము పరిశీలించిన ప్రాంతాల్లో ఇది మెరుగైన విధానమన్నారు. రైతులు, స్థానికులతో మాట్లాడి సేంద్రియ సాగు ద్వారా చేకూరుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ గణేష్, ఎంటీ గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

దారి కాచి... అడ్డగించి

- సెల్ ఫోను, రూ. నాలుగు వేలు దోపిడీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు సమీపం జాతీయ రహదారిలో గల జీరో పాయింట్ వద్ద ఒక వ్యక్తిపై ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే... ఒడిశాకు చెందిన షకీలాద్దీన్ స్థానిక ఫ్రెండ్స్ దాబాలో సప్లయిర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 2వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని తాను నివాసముంటున్న దివాన్‌చెరువులోని రూమ్‌కు వస్తుండగా, జీరో పాయింట్ వద్దకు వచ్చేసరికి ఐదుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి వెంబడించి, అతని జేబులో ఉన్న రూ. నాలుగు వేల నగదు, మొబైల్ ఫోన్ లాక్కుని పారిపోయినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకనైనా రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలి.

వృద్ధుడి ఏటీఎం కొట్టేసి...
రూ.30 వేలు అపహరణ

- ప్రకాష్ నగర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సుమారు 60 ఏళ్ల పైబడిన వృద్ధుడ్ని గుర్తుతెలియని ఓ వ్యక్తి అతన్ని ఏ మార్చి ఏటీఎం కార్డును తస్కరించాడు.

దీంతో రూ. 30 వేలును డ్రా చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం నారాయణపురం సమీపంలోని సుబ్బారావు నగర్‌కు చెందిన టీ.నాగభూషణం అనే వృద్ధుడు గతనెల 7న లాలాచెరువు రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లి డబ్బులు తీసుకునే సమయంలో అక్కడే వున్న గుర్తుతెలియని వ్యక్తి మాటల్లో పెట్టి నాగభూషణం ఏటీఎం కార్డును మార్చేశాడు. దీన్ని గమనించని వృద్ధుడు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. అయితే అతని బ్యాంక్ ఖాతాలోంచి గతనెలలోనే రెండు దఫాలుగా 30 వేలు నగదును సదరు గుర్తుతెలియని వ్యక్తి డ్రా చేశాడు. దీంతో బాధితుడు ప్రకాష్ నగర్ పోలీసులను బుధవారం ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం వడ్డి వీరభద్రరావునగర్‌లో ఒక ఇంట్లో గుట్టుగా వ్యభిచారం జరుగుతున్నట్టు బొమ్మూరు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐ కాశీవిశ్వేశ్వరరావు తన బృందంతో వెళ్లి దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో సీఐ రైడ్ చేయగా, ఆ గృహంలో నిర్వాహకులు గుబ్బల వెంకటలక్ష్మి, ఆమె భర్త సత్యనారాయణ, ఇద్దరు విటులు, ఒక బాధిత మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

వచ్చే నెల 8న జాతీయ లోక్ అదాలత్

- పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారని, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సంబంధించిన కేసులను కూడా విచారిస్తారని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఆ రోజున రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట,ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఉదయం 10 గంటల నుంచి కేసుల విచారణ ఉంటుందన్నారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, ప్రమాద, బ్యాంకు కేసులు, రాజీపడదగిన క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులకు రాజీమార్గం ద్వారా పరిష్కారం లభించడం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీజే సూచించారు.

అవినీతిని నిర్మూలిద్దాం : ఏసీబీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్ పేర్కొన్నారు. అవినీతిపై సమాచారాన్ని రాజమహేంద్రవరం రేంజ్ అడిషనల్ ఎస్పీ 9440446102, డీఎస్పీ 94404 46160, తూర్పు గోదావరి ఇన్‌స్పెక్టర్ 9440446161, కాకినాడ జిల్లా ఇన్‌స్పెక్టర్ 8332971041, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌స్పెక్టర్ 9440446163, రాజమండ్రి ల్యాండ్‌లైన్ 0883-2467833 నంబర్లకు ఫోన్ చేయడం ద్వారా తెలియజేయడం బాధ్యతగా భావించాలన్నారు. అవసరమైతే వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

వివాహిత అదృశ్యం

రాజానగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సంపత్‌నగరం గ్రామానికి చెందిన చెల్లూరి మణికంఠ అనే వ్యక్తి తన భార్య అదృశ్యమైనట్టు రాజానగరం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే ... మణికంఠ పాలడెయిరీలో పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే పాల డెయిరీకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య దుర్గ సూర్య, ఏడాది వయసు ఉన్న కుమార్తె నందిని ఇంట్లో కనిపించలేదు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన కోనే శ్రీనుపై అనుమానం ఉందంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ ఆదేశాల మేరకు ఎస్ఐ నారాయణమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమలాపురం నుంచి విశాఖపట్నం వరకు..!



అమలాపురంలో దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

- గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై చోరీల బాట పట్టిన యువకులు అరెస్టు
- మరో ముగ్గురు బాల నేరస్తులు కూడా అదుపులోకి
- రూ.8.82లక్షల విలువైన 13 మోటారు సైకిళ్లు స్వాధీనం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైన ముగ్గురు యువకులు మరో ముగ్గురు బాలలతో కలిసి వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. అమలాపురం నుంచి ప్రారంభించి విశాఖపట్నం జిల్లా కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధి వరకు వీరు చోరీలకు పాల్పడ్డారు. అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్‌లో నమోదైన మోటారు సైకిల్ చోరీ కేసును ఛేదించేందుకు తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నేరస్తులను పట్టుకునేందుకు నియమించారు. కోనసీమ జిల్లాలో వరుస దొంగతనాలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు యువకులను తాలూకా సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 13 మోటారు సైకిళ్లను చోరీ చేసిన మేకల హరివీరవెంకటశ్రీరామమూర్తి, వీరమల్లు తరుణ్ శశికుమార్, దొంగ లోకేశ్‌లతో పాటు మరో ముగ్గురు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. 13 మోటారు సైకిళ్లతో పాటు 3 ఎక్సైడ్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌తో పాటు అల్లవరం, ముమ్మిడివరం, అమలాపురం టౌన్, కొత్తపేట, విశాఖ జిల్లా కంచరపాలెం, ఉప్పలగుప్తం, అంబాజీపేట పోలీసుస్టేషన్ల పరిధిలో వీరు వరుస దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. రూ.8.82లక్షల విలువైన మోటారు సైకిళ్లతో పాటు ఎక్సైడ్ బ్యాటరీలను రికవరీ చేసినట్టు వెల్లడించారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐలతో పాటు ఏఎస్ఐ వి.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ యు.రవికుమార్‌రాజు, కానిస్టేబుళ్లు బి.శివరామకృష్ణ, ఎం.ధర్మరాజులను డీఎస్పీ ప్రసాద్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. కేసును ఛేదించిన వీరికి రివార్డులు అందజేయనున్నట్టు డీఎస్పీ తెలిపారు. చోరీ చేసిన మోటారు సైకిళ్లను అమ్మడంతో పాటు తాకట్టు పెట్టడం, ఒక్కోసారి చెత్తను కొనుగోలు చేసేవారికి స్క్రాప్ కింద అమ్మివేయడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాల ఆధారంగానే ఈ కేసును ఛేదించామన్నారు. యువకులపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే దొంగతనాలకు పాల్పడడంతో పాటు ఒక్కోసారి లా అండ్ ఆర్డరు సమస్యలు సృష్టించే అవకాశం ఉందన్నారు. భద్రత కోసం తప్పనిసరిగా ముఖ్యకూడళ్లలో, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతను డీఎస్పీ వివరించారు. బాల నేరస్తులను వ్యక్తిగత పూచీకత్తులపై ఇంటికి పంపిస్తున్నట్టు వెల్లడించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

ఏలూరు రేంజ్ పరిధిలో
గంజాయి రవాణా తగ్గుముఖం

- పాత నేరస్థుల మీద నిఘా
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత 7 నెలలుగా ఏలూరు రేంజ్ పరిధిలో గంజాయి సాగు, అక్రమ రవాణా బాగా తగ్గుముఖం పట్టిందని, ముఖ్యంగా డాబీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అదుపులో ఉందని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం సాధారణ తనిఖీలలో భాగంగా రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాల రవాణాపై ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను పెట్టిందని, గంజాయికి సంబంధించి ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరుకు ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. పాతనేరస్థుల మీద నిఘాపెట్టడం జరిగిందన్నారు. 15 వేల నుంచి 20 వేలమంది నేరస్థుల సమాచారం ఫోటోలు, వేలిముద్రలు, ఇతర వివరాలు డిజిటలైజ్ చేశామని.. భవిష్యత్తులో నేరాలు జరిగినప్పుడు వారిపై నిఘా పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. చిన్నపిల్లలు, మహిళల మీద నేరాలు చేసిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని ఇటువంటి నేరాలు జరుగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ పెరిగిన మాట వాస్తవమన్నారు. చాలామంది అమాయకులు, గ్రామీణ ప్రాంతాలవారు, చదువుకున్నవారు కూడా మోసపోతున్నారన్నారు. సైబర్ నేరాల ద్వారా సొమ్ములు పోగొట్టుకున్నవారు 1930కు 3 గంటల్లోపుగా తొందరగా ఫోన్ చేస్తే డబ్బులు బదిలీ కాకుండా బ్యాంకువారితో మాట్లాడి నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. రిజర్వుబ్యాంకు అనుమతించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని, ఎక్కువ మొత్తాలకు ఆశ పడి ప్రయివేటు సంస్థలను ఆశ్రయిస్తే మోసం జరుగుతుందని ఆయన తెలిపారు.

అంతర్వేది, శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

అంతర్వేది నరసింహస్వామి కల్యాణోత్సవాలకు 1500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, 140 సీసీ కెమెరాలు, డ్రోన్లతో బందోబస్తు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రధాన కంట్రోల్‌రూమ్‌కు అనుబంధంగా రెండు సబ్‌కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ఒకటి సముద్రం ప్రాంతంలో మరొకటి ఆలయం వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఆలయ అధికారులు, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి సామర్లకోట, ద్రాక్షారామ తదితర ప్రాంతాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ బి. రఘువీర్, సీఐ ఎం.వెంకట నారాయణ, ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు ఉన్నారు.

8 నుంచి భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ఆలయ సహాయ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ సహాయ కమిషనర్ భవానీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 8 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవానీ తెలిపారు. బుధవారం ద్రాక్షారామ స్వామివారి దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 8న 3.30 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు నంది వాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుందన్నారు. రాత్రి 11.05 గంటలకు మణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, చండీకా సమేత సూరేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. 9 నగరుడ వాహనంపై నగరోత్సవం, 10న సాయంత్రం పండిత సదస్యం, రాత్రి 8 గంటలకు సర్వవాహనములపై నగరోత్సవం జరుగుతుందన్నారు. 11న మధ్యాహ్నం 2.55 గంటలకు రథోత్సవం జరుపుతామన్నారు. 12న వసంతోత్సవం, నాకబలి గ్రామోత్సవం, త్రిశూల శ్రీచక్రస్నానములు, రాత్రి 8 గంటలకు సర్వ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 13న సప్తగోదావరి నదిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. 14న శ్రీపుష్పోత్సవం జరుపుతామన్నారు. 8న ఉదయం స్వామివారికి దాతలు సత్తి సుబ్బారెడ్డి దంపతులతో లక్ష రుద్రాక్షల పూజ జరుపుతామన్నారు. భక్తులు కల్యాణోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కల్యాణ మహోత్సవాలు నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో తెలిపారు.

భీష్మ ఏకాదశికి..
సత్యదేవుని సన్నిధిలో ఏర్పాట్లు

పరిశీలించిన ఈవో



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని సత్యదేవుని సన్నిధికి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా అన్నవరం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 15వేల వ్రతాలు వరకు జరుగుతాయని, 80వేల నుంచి లక్షమంది వరకు స్వామి సన్నిధికి విచ్చేస్తారనే అంచనాకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలలో తొక్కిసలాట సంఘటన నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడికక్కడ క్యూలైన్ల పటిష్ఠపరచడం, వ్రతాలు, దర్శన సమయాల్లో భక్తులు తోసుకోకుండా పశ్చిమరాజగోపురం వద్ద హోల్డింగ్‌పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్‌లలో తాగునీరు సదుపాయం, పలుచోట్ల చిన్నారులకు పాలు పంపిణీ, వృద్ధులు, దివ్యాంగుల కోసం లిఫ్ట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఈవో వీర్ల సుబ్బారావు, దేవస్థానం సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. రాత్రి 10గంటల నుంచి వ్రతం టిక్కెట్ల విక్రయాలు ప్రారంభించి 12 గంటల నుంచి వ్రతాలు, ఒంటిగంట నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని ఆదేశించారు. బుధవారం వ్రతపురోహిత సూపర్‌వైజర్లతో ఈవో సమావేశమయ్యారు. వ్రతమాచరించుకునే భక్తుల పట్ల పురోహితులు మర్యాదపూర్వకంగా మెలగాలని, వారికి వచ్చిన సందేహాలను విసుగుచెందకుండా వివరంగా తెలపాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు, ఏఈవోలు శ్రీనివాస్, జగ్గారావు, సూపరెంటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

నీతి అయోగ్ సభ్యురాలు పూజలు

సత్యదేవుడి సన్నిధిలో బుధవారం నీతిఅయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సరస్వాట్ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందచేయగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



ఆయోగ్ సభ్యురాలు సరస్వాట్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

కళాశాల బస్సు ఢీకొని మూడేళ్ల చిన్నారి మృతి



మృతి చెందిన సుకన్య (ఫైల్)

తొండంగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పటివరకూ చెంగుచెంగున గెంతుతూ ఆటలాడుకున్న చిన్నారి కొద్ది నిమిషాల వ్యవధిలో విగత జీవిగా మారింది. బుధవారం కాకినాడ జిల్లా తొండంగి మండలం సీతారాంపురంలో శివకోటి సుకన్య (3) అనే చిన్నారిని తునికి చెందిన ఎస్‌వి జూనియర్ కళాశాల బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఉదయమే విద్యార్థులతో కళాశాలకు వెళ్తున్న బస్సు డ్రైవర్ నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా చిన్నారి మృతి చెందిందని గ్రామస్తులు, బంధువులు ఆరోపించారు. సింహాద్రి అప్పన్న, నాగలక్ష్మికి ఉన్న నలుగురు పిల్లల్లో సుకన్య మూడో సంతానం. అల్లారు ముద్దుగా పెరిగిన చిన్నారి కళ్లెదుటే శవమై కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

దళిత సంఘాల ఆందోళన

చిన్నారి మృతికి కారణమైన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దళిత నేతలు ఆందోళన చేపట్టారు. యాజమాన్యం వచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తుని రూర్ ఎస్ఐ కృష్ణమాచారి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సంఘటనపై కేసు నమోదు చేశారు.



ఆందోళన చేస్తున్నవారితో చర్చలు జరుపుతున్న ఎస్ఐ

తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు ప్రారంభం



తాటిపర్తిలో పోటీలను ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాట్లాడుతున్న పడాల రవి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో 18వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై ఈనెల 9వ తేదీ వరకూ నిర్వహించే ఈ పోటీలను జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నాటకాలను ప్రోత్సహించేందుకు నాటక కళాపరిషత్‌ల ద్వారా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాటకాలకు నేటికి ఆదరణ తగ్గలేదని, ఇందుకు నిదర్శనం నాటికలను తిలకించేందుకు వస్తున్న ప్రజానీకమేనని తెలిపారు. మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, న్యాయవాది పడాల రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, అపర్ణాదేవి ఆలయ కమిటీ ఛైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, జనసేన నాయకులు బవిరిశెట్టి రాంబాబు, పిల్లా శివశంకర్, వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి ఉన్నారు.

మూడో రోజుకు ఆలిండియా లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐటా, గోదావరి ఏపీఎల్‌టీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా అండర్-16 లాన్ టెన్నిస్ పోటీలు బుధవారం మూడోరోజుకు చేరాయి. క్వార్టర్ సెమీఫైనల్‌లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు తలపడ్డారు. బాలుర విభాగంలో ధ్రువ్ (తమిళనాడు)పై ఎస్‌వీసూర్య(ఏపీ) 6-06-1, తనీష్(తెలంగాణ)పై దుర్గాశ్రీ (ఏపీ) 3-6,6-3,6-4, విన్సెంట్(ఏపీ)పై విశ్రాంక్(తెలంగాణ) 6-26-4, భువన్(ఏపీ)పై భవేష్(తెలంగాణ)7-6,6-1 స్కోరుతో గెలుపొందారు.

బాలికల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో జోషిత(ఏపీ)పై సుమేరా(ఏపీ)7-6(4)6-1, గౌరిశ్రీ (తెలంగాణ)పై జానకి(ఏపీ), 6-3,6-1, సవర్ణిక(తెలంగాణ)పై లేఖ్య(ఏపీ)7-5,7-5, జోహా(తెంగాణ)పై సంజన(ఏపీ)6-2,6-3 స్కోరుతో గెలుపొందారు. లాన్‌టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ పర్యవేక్షించారు.

బాలికను మోసం చేసిన బాలుడిపై పోక్సో కేసు

రాజానగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని నమ్మ బలుకుతూ... తీరా పెళ్లి చేసుకుందామని ఆ బాలిక అడగడంతో ముఖం చాటేశాడు ఓ బాలుడు... వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా రాజానగరం - నరేంద్రపురం జంక్షన్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక బాలికను అదే ప్రాంతంలో ఉంటున్న బాలుడు హైస్కూల్ స్థాయి నుంచి నిన్ను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండేవాడు. కొంతకాలం తిరస్కరిస్తూ వచ్చిన సదరు బాలికను ఎట్టకేలకు లొంగదీసుకున్నాడు. ఈ మేరకు బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎస్ఐ నారాయణమ్మ దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

మానవ జీవనంలో కళ అత్యుత్తమం

సినీ గేయ రచయిత జొన్నవిత్తుల
'శ్రీప్రకాష్'లో హరివిల్లు కార్యక్రమం



జొన్నవిత్తులను సత్కరిస్తున్న విజయ్‌ప్రకాష్

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మానవ జీవనంలో కళ అత్యుత్తమమైనది, అది అత్యుత్తమమైన మనస్సుకు ప్రశాంతతనిస్తుందని కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. కాకినాడ సురేష్ నగర్ శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లోని సీతానరసింహ క్షేత్రం నందు శ్రీప్రకాష్ విద్యాసంస్థలు కాకినాడ, పెద్దాపురం శాఖలు సంయుక్తంగా బుధవారం హరివిల్లు కార్యక్రమం నిర్వహించాయి. ఐదురోజుల పాటు జరిగే హరివిల్లు ఆర్ట్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌లో విద్యార్థులు చిత్తు కాగితాలతో రూపొందించిన చిత్తరువులు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన జొన్న విత్తుల, చిత్రకారిణి గౌరీవేముల, గ్రంధి రాజగోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జొన్న విత్తుల మాట్లాడుతూ హరివిల్లు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నిద్రాణమై ఉన్న శక్తిని వెలికితీసి సమాజానికి ఒక అద్భుతమైన సందేశాన్ని ఇచ్చే విధంగా చిత్రాలు, కళాకృతులు ఉన్నాయన్నారు. గౌరీ మాట్లాడుతూ కళ అనేది ఒక తపస్సు అని కళాకారుడు ఒక రుషీశ్వరుడని అన్నారు. అతిథులను శ్రీప్రకాష్ డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ సత్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ కాకినాడ ఫౌండర్ కిషోర్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రీప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

పాదగయలో..

మహాశివరాత్రి ఉత్సవాలపై నేడు సమీక్ష

పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లుపై గురువారం మధ్యాహ్నం 3గంటలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చేయాల్సిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఆర్డీవో సమీక్షిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచి 8550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 2450 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 1700 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4400 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8562 క్యూసెక్కులు ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.65 అడుగులుగా నమోదయింది.

వ్యక్తిని పొడిచిన కేసులో నిందితుడికి ఏడాది జైలు

కడియం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియపులంక గ్రామంలో 2020లో దొంగ ఓ ఇంటిలో దొంగతనం చేసి పారిపోతుండగా అదేసమయంలో అతడిని అడ్డుకున్న వ్యక్తిని పొడవడంతో దొంగకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి చావలి రమ్య తీర్పు నిచ్చారు. సీఐ ఏ.వేంకటేశ్వరరావు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. 2020లో కడియపులంకలో ఓ వ్యక్తి ఓ ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డాడు. అనంతరం పారిపోతున్న సమయంలో ఓ వ్యక్తి అడ్డుకోవడంతో దొంగ పొడిచాడు. ఈ విషయంపై అప్పటి ఎస్ఐ ఎస్ కే.అమీనాబేగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి క్రైం కానిస్టేబుల్ కే.సురేష్ నిందితుడిని అరెస్టు చేశారు. 3వ ఏజెఎఫ్‌సీఎం ప్రిన్సిపల్ జూవైనల్ జస్టిస్ బోర్డ్ కోర్ట్ నందు ప్రస్తుత సీఐ ఏ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎం రాజేంద్ర సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ సీహెచ్ రాజశేఖర్ వాదనలు వినిపించారు. దీంతో దొంగతనానికి పాల్పడి పారిపోతున్న సమయంలో అడ్డుకున్న వ్యక్తిని పొడిచిన నిందితుడు నేతల రాజేష్‌వర్మ అలియాస్ రాజేష్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు రెండున్నరేళ్ల జైలు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిలిస్టు మృతికి కారణమయిన లారీ డ్రైవర్‌కు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం ఆసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.బాబు బుధవారం తీర్పు చెప్పారు. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సిగటాపు శ్రీనివాసరావు విధి నిర్వహణ అనంతరం కాకినాడకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా చిత్రాడ మహాలక్ష్మీ ఆలయం వద్ద ఎదురుగా రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడిక్కడే మరణించాడు. 2021లో జరిగిన ఈ సంఘటనపై అప్పటి పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం లారీ డ్రైవర్ పోతల అప్పలనాయుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో అప్పలనాయుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీలు ఎం.ప్రకాశరావు, జి.వినయప్రతాప్‌లు వాదనలు వినిపించారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కంప్యూటర్, లాప్‌టాప్‌లు, ప్రింటర్ స్వాధీనం



నిందితుడితో పోలీసులు స్వాధీనం చేసుకున్న లాప్‌టాప్‌లు, ప్రింటరు, కంప్యూటర్

కడియం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పలు చోట్ల దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిలో ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి కంప్యూటర్, లాప్‌టాప్, ప్రింటర్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు కడియం పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం....గత నెల 9వ తేదీన స్థానిక జాతీయ రహదారి పక్కన వెంకయ్యపేట పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ నందు షటర్ తాళాలు బద్దలు గొట్టి లాప్‌టాప్, కంప్యూటర్, కొంత నగదు దొంగిలించినట్టు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. తూరుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు, డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో కడియం సీఐ ఏ.వేంకటేశ్వరరావు, ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ ఈ కేసు ఛేదించారు. ఈ చోరీలకు ముగ్గురు పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారు. ముగ్గురిలో ఒకరైన దొంగతనానికి పాల్పడిన కృష్ణా జిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన అల్లడి నాగ మణికంఠ ఈశ్వర్‌ను అరెస్టు చేసి అతడి నుంచి లాప్‌టాప్, కంప్యూటర్, తణుకు పరిధిలో దొంగతనం చేసిన ఓ మోటారు సైకిల్, కొత్తగూడెం పరిధిలో దొంగతనం చేసిన లాప్‌టాప్, ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టు... మరోవ్యక్తిని టంగుటూరు పోలీసుస్టేషన్ పరిధిలో అరెస్టు చేశారని,మరోవ్యక్తి పరారీలో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్‌లు వీఎస్వీ మహాలక్ష్మి, వి.వెర్నమ్మ అన్నారు. ముక్కామల, చిరతపూడి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వబాల్యదశ సంరక్షణ విద్య (ఈసీసీఈ)డేను బుధవారం నిర్వహించారు. పౌష్టికాహారం, గుడ్లను పరిశీలించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ముమ్మిడివరం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ అన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ అధ్యక్షతన రహదారిభద్రత, డ్రంక్అండ్‌డ్రైవ్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఎస్‌ఐమాట్లాడారు.

శివాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడిలోని శ్రీఉమావల్లభేశ్వరస్వామివారి శివాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం విఘ్నేశ్వరపూజ, వాస్తుపూజ, వాస్తు హోమం, వాస్తు బలిహరణ, గ్రామ ప్రదక్షిణ, జలాదివాసం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుడు బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ 21మంది యాజమాన్య దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, ఉమాదేవి, వల్లభేశ్వరస్వామి, నంది, కాలభైరవస్వామి, దక్షిణామూర్తి, చండీశ్వర, నవగ్రహ, ద్వార పాలకుల విగ్రహాలను ప్రత్యేకంగి అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలు, డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ వివిధ వేషధారణలు, శక్తివేషాలు, నాగసాధువుల వేషధారణలతో పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య విగ్రహాలను గ్రామ ప్రదక్షిణ చేయించారు. ఈ సందర్భంగా కోలాటం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పునఃప్రతిష్ఠా మహోత్సవానికి హాజరుకాగా పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, నగరపంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, గొలకోటి దొరబాబు, తాడి జానకీరామ్, గొల్లపల్లి గోపి, నాయకులు గోదశి నాగేశ్వరరావు, సానబోయిన మల్లికార్జునరావు, బొర్రా విష్ణు, కౌన్సిలర్ మాదాల నాగసత్య మంగాకుమారి, ఈవో కె.కార్తీకలతో పాటు పలువురు పాల్గొన్నారు. రాత్రి ప్రత్యేక శ్రీభారతి భాగవతి హరికథా కాలక్షేపం, ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రవచనాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

పేరాబత్తుల విజయానికి కృషి చేయండి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

మలికిపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్‌ను మంచి మెజార్టీతో గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సభలో ఆయన మాట్లాడుతూ వార్ వన్‌సైడ్‌గా ఉండాలన్నారు. ప్రత్యర్థి పార్టీలకు ఒక్క ఓటు కూడా పడకూడదని, ఆ లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ఒక వ్యక్తికి 30 ఓట్లు కేటాయిస్తామని, 22 రోజులు మనసు పెట్టి పనిచేయాలన్నారు. ప్రతీ ఓటరును మూడు లేక నాలుగు సార్లు కలవాలన్నారు. ఓటు అడిగే హక్కు, ధైర్యం మనకే ఉందన్నారు. నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్‌ను, గ్రూప్-1 ఉద్యోగాలను స్కూళ్లు తెరిచే నాటికి 17,500 ఉపాధ్యాయ పోస్టులు వేస్తున్నామన్న సంగతిని అందరికీ తెలియచెప్పాలన్నారు. పరిశ్రమలు తెచ్చామని, రూ.10లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటికే రూ.6లక్షలకోట్లను పెట్టుబడులకు కేబినెట్ అనుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాల్లో కాల్వల ఆధునికీకరణను అంశాన్ని సీఎం దృష్టిలో పెట్టామని, అంచనాలు తయారవుతున్నాయని, నాబార్డు సహకారంతోనైనా రైతుల సమస్యలు తీరుస్తామన్నారు. ఇప్పటికే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 70శాతం అమలు చేశామన్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం నుంచి రాజశేఖర్‌కు అత్యధిక మెజార్టీ ఇస్తామన్నారు. రాజోలు నియోజకవర్గంలో 11,366 ఓట్లు ఉన్నాయని, 17పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతీ 30మందికి ఒక ఇన్‌చార్జిని నియమించి రెండు రోజుల్లో ప్రతీ ఓటరును కలిసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత, శాసనమండలి మాజీ సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీలు ఎంవీ సత్యవాణి, కేతా శ్రీనివాస్, మంగెన భూదేవి, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, అడబాల రాంబాబు, దిరిశాల బాలాజీ, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, గుబ్బల ఫణికుమార్, మల్లిపూడి సత్తిబాబు, చాగంటి స్వామి, కాండ్రేగుల భవానీలావణ్య, భూపతిరాజు సాయిబాబురాజు, పినిశెట్టి బుజ్జి, అడబాల సాయిబాబు, కాకి లక్ష్మణ్, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.


లక్కవరం సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

రాజశేఖర్ విజయం కోసం పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి తరఫున బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కూటమి సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి ఏవిధంగా కృషి చేయాలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పరిశీలకుడు పెచ్చెట్టి బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మిలు వివరించారు. సమావేశంలో కూటమి నాయకులు కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, కంచిపల్లి అబ్బులు, నల్లా శ్రీధర్, ఆకుల బుజ్జి, లింగోలు పండు, కొప్పుల నాగమానస, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీలు అధికారి జయవెంకటలక్ష్మి, దేశంశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు తక్షణం చర్యలు చేపట్టాలి

అయినవిల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విలస గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ పాల్గొన్నారు. వరి పొలాలను పరిశీలించారు. సాగునీటి ద్వారా వ్యాపించే కలుపుమొక్కలు, నీటితామర, సాల్వినియా, అంతర్ తామర మొదలగు కలుపులతో పాటు జింక్ లోపం ప్రారంభ దశలో ఉన్న అగ్గి తెగులు, కాండం తొలిచే పురుగు వ్యాధులను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, మండల వ్యవసాయాధికారి వై.శోభ తదితరులు పాల్గొన్నారు.

సపక్‌తక్రా క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న తాతబాబు తదితరులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో వివిధ విభాగాల్లో నిర్వహించిన సపక్‌తక్రా క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల అభినందనసభ సపక్‌తక్రా క్రీడా అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం ఎస్కేబీఆర్ క్రీడా ప్రాంగణంలోని ర్వహించారు. వరంగల్‌లో జరిగిన సీనియర్ విభాగ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కేతా సతీష్, సీహెచ్ మోహన్‌కృష్ణ, కేరళలోని పాలక్కడ్‌లో జరిగిన సబ్‌జూనియర్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సీహెచ్‌శశిధర్, కె.పూర్ణలక్ష్మీప్రసన్న, విజయవాడలో స్కూలు గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో ప్రతిభకనబరిచిన గోసంగి సందీప్‌ను, శిక్షణ ఇచ్చిన వారిని తాతబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అభినందించి సత్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఇందుకూరి శ్రీధర్‌వర్మ, డాక్టర్ యెనుముల నరసింహారావు, మునగాల మన్యం, కూచిమంచి కృష్ణ, తోట రాము, కేవీవీ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బూల చిరంజీవి, ఎస్ఎస్ఎన్ఐఎస్ కోచ్ యాండ్ర గౌతమ్ అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో పేకాట శిబిరంపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో బుధవారం పట్టణ పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.77,520 నగదుతో పాటు పది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

సాయం పంపిణీ

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి బొంతువారి పేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాల వారికి అమలాపురం మహిళా వార్క్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో కిరాణా సరుకులు, బియ్యం, దుప్పట్లు, నూతన వస్త్రాలు, స్టీలు సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, డాక్టర్ కొప్పుల నాగమానస, బులిటెన్ ఎడిటర్ పుత్సా కృష్ణకామేశ్వర్, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, గోటేటి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు అగ్ని ప్రమాద బాధితులకు సాయం పంపిణీ చేశారు. వంటెద్దు బాబీ, సుగ్గు ప్రసాద్, మొల్లేటి వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ వి.నరసింహారావు (బుజ్జి) ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు, దుప్పట్లను హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గుబ్బల పెద్దిరాజు పంపిణీ చేశారు.

లేబర్ కోడ్‌లను నిరసిస్తూ ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్ అమలును నిలిపివేసి తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కార్మికులంతా పోరాటానికి సిద్ధపడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేయాలని నినాదాలు చేశారు. లేబర్ కోడ్‌లకు వైసీపీ, టీడీపీ ఎంపీలు మద్దతు తెలపడాన్ని నిరసించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, కోశాధికారి కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షులు బాస్కరరావు, బి.వెంకటలక్ష్మి, జితేంద్ర, అంగన్‌వాడీ జిల్లా కోశాధికారి పి.అమూల్య తదితరులు పాల్గొన్నారు.


సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

అంతర్వేది గజమాల యాత్ర ప్రశాంతంగా జరగాలి

అల్లవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది వరకు సాగే గజమాల యాత్ర ప్రశాంత వాతావరణంలో జరగాలని అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. ఓడలరేవు గ్రామంలో గ్రామస్తులతో బుధవారం గజమాల యాత్రకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఊరేగింపు ప్రశాంతంగా ఉండాలని, మోటారు సైకిళ్ల సైలెన్సర్లు తీసివేసి వాహనాలు నడపవద్దని సూచించారు. అల్లవరం ఎస్ఐ జి.హరీష్ కుమార్, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, పెమ్మాడి వెంకటరామారావు, కలిగితి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 308 పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ఆత్మరక్షణ శిక్షణ ఇవ్వనున్నట్లు అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. సమగ్ర శిక్షాభియాన్ ద్వారా ఆత్మరక్షణ పద్ధతులను విద్యార్థినులకు బోధించేందుకు రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు వివరించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపేష్ విద్యా సంఘం నిర్వహణలో జిల్లాలోని 239ఉన్నత పాఠశాలలతో పాటు 69ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థినులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో తొలి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాధవి మాట్లాడుతూ తమను తాము రక్షించుకునేందుకు కరాటే దోహద పడుతుందన్నారు. కుంగ్‌ఫూ, కరాటే, జూడోను విద్యార్థినులకు నేర్పిస్తామన్నారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా గర్ల్‌చైల్డ్ ఆఫీసర్ డాక్టర్ ఎంఏకే భీమారావు, సెక్టోరియల్ అధికారి రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బీర హనుమంతరావు, హెచ్ఎంలు విజయకుమారి, ఎస్.రాజరాజేశ్వరి, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన


గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.బలరామ్ విమర్శించారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గాంధీబొమ్మ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బలరామ్‌తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆంధ్ర మాల్యాద్రి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. నిరసనలో జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణవేణి, గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, టి.నాగవరలక్ష్మి, పీతల రామచంద్రరావు, కె.గోపాలం, భాస్కరరావు, తాడి శ్రీరామమూర్తి, శంకర్, కె.సాయి పాల్గొన్నారు.

చండీ, రాజశ్యామల హోమం

ఉప్పలగుప్తం,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారంలో నక్షత్ర నవగ్రహ పూర్వక మహాసౌరయాగంలో బుధవారం చండీ, రాజశ్యామల హోమం నిర్వహించారు.

ఉద్యోగ అవకాశాల కల్పనకు కార్యాచరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు భవిష్యత్తు కార్యాచరణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వన్ మిలియన్, వన్ బిలియన్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలపై సమీక్షించారు. సంస్థ డైరెక్టర్ అభిరామ్ మాట్లాడుతూ స్కిల్ అండ్ జాబ్ రెడీనెస్ కోసం సంస్థ పనిచేస్తుందని తెలిపారు. వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, ప్రోగ్రాం మేనేజర్ రెమా, జిల్లా హెడ్స్ జాన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగరపంచాయతీ ఈశ్వరమ్మవారి ఆలయంలో శ్రీరుక్మాంబ సమేత పాండురంగస్వామివారి పంచయాతన సంపూర్ణ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. వేదపండితులు శ్రీమాన్ సుదర్శనం వెంకటజనార్థనాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. విళ్ల ఈశ్వరరావు-మాధవి దంపతులు, విళ్ల గణేష్-సౌజన్య దంపతులతో ఆలయ పునర్నిర్మాణం జరిగింది. నూతన ఆలయంలో బుధవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షారాధన, చతుర్వేద పారాయణం, యాగశాల ప్రవేశం, యాగమందిర పూజ, వాస్తుపూజ, అంకురారప్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, శాంతి హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి-సన్నవిల్లి ఓఎన్జీసీ సెంటర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు ముగిశాయి. బుధవారం గరగ నృత్యాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ముడుపులు సమర్పించుకున్నారు. అమ్మవారి తీర్థం వైభవంగా జరిగింది. కొండ్రు సత్యసుబ్రహ్మణ్యేశ్వరరావు(రాజు), కొండ్రు దుర్గారావు, తాడాల నాగవిష్ణువరప్రసాద్ ధన సహాయంతో నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మాతంగి కన్యకల పూజ



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శ్యామల నవరాత్రుల్లో భాగంగా అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో ఏడో రోజు బుధవారం వేము వెంకటశివకుమార్ ఆచార్య బ్రహ్మత్వంలో మాతంగి కన్యకల పూజ అత్యంత వైభవంగా జరిగింది. పదుల సంఖ్యలో హాజరైన కన్యలను మాతంగి స్వరూపంగా భావించి పూజలు చేశారు. శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో శ్యామలాదేవి షోడసరాత్రి పూజా మహోత్సవాల్లో భాగంగా శ్యామలాదేవి విశిష్టతను శివకుమార్ వివరించారు. జ్ఞాన సముపార్జనకు సంగీత, సాహిత్య రంగాల్లో విజయాన్ని పొందేందుకు శ్యామలాదేవి ఉపాసన దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అక్షయపాత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఒకేషనల్ ప్రాక్టికల్స్

అంబాజీపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎం కళాశాలలో ఒకేషనల్ మొదటి, రెండో సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి, చీఫ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్ రావు తెలిపారు. మొదటి సంవత్సరానికి 30మందికి 26మంది, ద్వితీయ సంవత్సరం 69మందికి 60మంది హాజరయ్యారన్నారు.

రాజోలు నియోజకవర్గాన్ని ఆదుకోండి: ఎమ్మెల్యే

మలికిపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇచ్చి ఆదుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడును కోరారు. నియోజకవర్గంలోని 60గ్రామాలు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నాయని, డ్రైన్లు ఆక్రమణకు గురవడంతో పాటు చాలాకాలం నుంచి పూడికలు తీయకపోవడంతో వ్యవసాయం అడుగంటిపోయిందన్నారు. ఖరీఫ్‌లో14వేలఎకరాల ఆయకట్టుకు 3400ఎకరాలు మాత్రమే సాగుచేశారని, 10లక్షల కొబ్బరి చెట్లు ఉంటే, లక్షన్నర కొబ్బరి చెట్లు చనిపోయాయని ఆయన దృష్టికి తెచ్చారు. నియోజకవర్గంలో వంద మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారని, అన్నివిధాలుగా ఇబ్బందులు పడుతున్నామని, నిధులిచ్చి ఆదుకోవాలని మంత్రి దృష్టికి తెచ్చారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రాజోలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చింతలపల్లిలో సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అంజు కంటి ఆసుపత్రి సిబ్బంది బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ ప్రసన్నకుమారి బుధవారం ప్రారంభించారు. 68మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల్లో కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి మామిడికుదురు అంజు కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ తేజ తెలిపారు. ఉచితంగా కంటి వైద్య పరీక్షలుచేసి ఆపరేషన్లు చేస్తున్న అంజు కంటి వైద్య ఆసుపత్రి సిబ్బందిని సర్పంచ్ ప్రసన్నకుమారి అభినందించారు. కార్యక్రమంలో మట్టా సురేష్ డాక్టర్ రూహీ, టెక్నీషియన్ బాలస్వామి, మేనేజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు గ్రాసాల భారం

అయినవిల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసాల ధరలు పెరిగిపోవడంతో పశువులను పోషించే పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలతో వరికోతలు చేస్తుండడంతో ఎండుగడ్డి పూర్తిస్థాయిలో రాకపోవడంతో వరి గడ్డికి కొరత ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండుగడ్డి కొరత వల్ల డిమాండ్ పెరిగి ధరలు పెరిగిపోయ్యాయని, పెరిగిన ధరలతో పశుపోషణ భారంగా మారిందని రైతులు అంటున్నారు. వరికోతల అనంతరం చేలల్లో ఉన్న గడ్డిని కట్టలు చుట్టే యంత్రాలు రావడంతో ఎండుగడ్డి కట్టలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఎండుగడ్డి ఎకరా రూ.4వేలు వంతున కొనుగోలుచేసి గడ్డి చుట్టడానికి కట్టకు రూ.30 చెల్లిస్తున్నామని రైతులు చెబుతున్నారు. చుట్టిన గడ్డి రైతు వద్ద కాకుండా బయట కొనుగోలు చేస్తే కట్టకు రూ.130 చెల్లించాల్సి వస్తుందంటున్నారు. దాణా రేట్లు పెరిగిపోవడం వల్ల పశుపోషణ భారంగా ఉందని పాడి రైతులు అంటున్నారు.

మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలి

కాట్రేనికోన, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మురమళ్ల నుంచి పల్లంకుర్రు వరకు భారీ వాహనాలు వెళ్లకుండా గతంలో హెడ్‌వర్క్స్ అధికారులు చర్యలు తీసుకున్నారు. మురమళ్ల కుండలేశ్వరం, పల్లంకుర్రు వద్ద ఏటిగట్టుపై గడ్డర్లు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి పల్లంకుర్రుకు చెందిన ఒక రైస్ మిల్లు యజమాని తౌడులోడు లారీలను ఏటిగట్టు మీదుగా తరలించారు. దీనికోసం గడ్డర్లను లేపేశారు. దీంతో రోడ్డు పలుచోట్ల దిగబడిందని పల్లెపాలెం వాసులు ఆందోళన చెందుతున్నారు. ఏటిగట్టు దెబ్బతినడానికి కారణమైన మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

'టీడీపీ నియోజకవర్గ కన్వీనర్‌ను మార్పు చేయాలి'

పి.గన్నవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ కన్వీనర్‌గా నామన రాంబాబును తొలగించాలని కోరుతూ నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలెంలో మంత్రి కాన్వాయ్ వద్ద ఆయనకు వినతిపత్రం అందించారు. నామన రాంబాబు 2014లో జడ్పీటీసీగా పి.గన్నవరం నుంచి పోటీచేశారని, అప్పటి నుంచి నియోజకవర్గ కోకన్వీనర్‌గా వ్యహరిస్తూ త్రీమెన్ కమిటీ కన్వీనర్‌గా కూడా కొనసాగుతున్నారన్నారు. నామన రాంబాబు ఆయన చెప్పిందే వేదవాక్కు అంటూ పార్టీని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోళ్ల వెంకట ప్రసాద్, మద్దాల సుబ్బారావు, దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, రవణం రాము, చిట్టూరి శ్రీనివాస్, పత్తిపాటి వెంకన్నబాబు, కొమ్ముల నాగబాబు, ఆకుమర్తి ఆశీర్వాదం, పడాల సూపర్, పెచ్చెట్టి వీరవెంకట సత్యనారాయణ, కేదాశి చిన్న, సాధనాల ఎన్సీ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే బుచ్చిబాబు ప్రచారం

కాట్రేనికోన, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు సాపేవారిపేట హైస్కూల్ ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఓటర్లను బుధవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కలిసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో చెల్లి అశోక్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, దాట్ల పృథ్వీ, వెంట్రు సుధీర్, ఇసుకపట్ల అమ్మాజీరాంబాబు, ఇసుకపట్ల వెంకటరమణ, గెద్దా శ్రీను, గెద్దం చంద్రశేఖర్, తానింకి పుల్లయ్య, తానింకి శ్రీను, కడలి వెంకటసత్యనారాయణ, కాశి జ్యోతిబాబు, సాపే రూప, వాకపల్లి అప్పారావు, మోకా అప్పారావు, అయితాబత్తుల శ్రీను, ఇసుకపట్ల జయంతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న స్వాగతద్వారం



మామిడికుదురు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి దేవస్థానానికి వెళ్లే మార్గంలో పాశర్లపూడి కొండాలమ్మచింత వద్ద లైటింగ్‌తో ఏర్పాటుచేసిన స్వాగత ద్వారం ఆకట్టుకుంటుంది. కొండాలమ్మ చింత సెంటర్‌లో స్వాగత ద్వారంపై రెండు వైపులా శంఖు చక్రాలతో వేంకటేశ్వరస్వామి సాక్షాత్కరిస్తున్న దృశ్యం భక్తుల మనసులను రంజింపచేస్తుంది. రాత్రి సమయాల్లో మిరుమిట్లు గొలిపే లైటింగ్‌తో భక్తులను ఆకర్షిస్తూ ఈవిధంగా స్వాగత ద్వారం ఏర్పాటుచేశామని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వసతిగృహ విద్యార్థులు ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత సూచించారు. మామిడికుదురులోని బాలుర వసతి గృహంలో వైద్యాధికారిణి బుధవారం 65మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. సీహెచ్‌వో సత్యవతి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ రోషిణి, ఏఎన్ఎం దుర్గాదేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రసాద్ విద్యా సేవలు మరువలేనివి

కళాశాలల కరస్పాండెంట్ ప్రసాద్ సంతాప సభ

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా చిక్కం వీరవెంకటసత్యవరప్రసాదరావు విద్యార్థులకు, సంస్థకు అందించిన సేవలు మరువలేనివని పలువురు వ్యాఖ్యానించారు. ఉప్పలగుప్తం చిక్కం సత్తిరాజు అన్నసత్రం అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, గొల్లవిల్లి చిక్కం సత్తిరాజు మెమోరియల్ జూనియర్ ఒకేషనల్ కళాశాలలు, మోటూరి సుబ్రహ్మణ్యం సీతాయమ్మ డిగ్రీ కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దివంగత చిక్కం వీరవెంకటసత్యవరప్రసాదరావు సంతాప సభ బుధవారం కళాశాల ఆవరణలో జరిగింది. ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా ప్రసాద్ స్థానంలో చిక్కం రాజేంద్రప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో కళాశాలల పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


స్పౌజ్ పెన్షన్ వర్తించేలా చూడాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ తీసుకుంటూ భర్త చనిపోయిన సందర్భంలో భార్యకు పెన్షన్ కన్వర్షన్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నవంబరు 15, 2024 కటాఫ్ డేట్‌గా ఉండడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారని తెలియచేస్తూ వినతిపత్రాన్ని జిల్లాఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడుకు బుధవారం రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాసరావు అందజేశారు. వినతిపత్రంలో 2024నవంబరు 15కు ముందు భర్త చనిపోయినా స్పౌజ్ పెన్షన్ వర్తించడం లేదని, ఈనిబంధనతో పలువురు ఇబ్బంది పడుతున్నారని, కావున ఈనిబంధనలు సడలించి వారిని ఆదుకోవాలని కోరారు. మొదటి ప్రాధాన్యతగా వితంతు, దివ్యాంగుల కేటగిరిల వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని, రేషన్‌కార్డుల విషయంలో మరణ తొలగింపులు, బదిలీ అవకాశం కల్పించాలని వినతిపత్రం ద్వారా కోరారు. వర్ధినేని బాబ్జీ, సాపే ఏకాదశి, అప్పారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజోలుకు ఇన్‌చార్జిని నియమిస్తాం : అచ్చెన్నాయుడు

మలికిపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో తెలుగుపార్టీకి త్వరలో ఇన్‌చార్జిని నియమిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం లక్కవరంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గ పరిస్థితి ఆద్యంతం తనకు తెలుసునని, ఇదే విషయమై మీ జిల్లాలో రెండు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిల నియామకం కోసం సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్‌లతో సంప్రదించినట్లు చెప్పారు. వారు తన అభీష్టానికి వదిలివేశారని, ఈలోపులో ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో వాయిదా పడిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయిన వెంటనే రాజోలు నియోజకవర్గానికి అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని ఇన్‌చార్జిగా నియమిస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలు రావడం సహజమని, వాటన్నింటినీ ఇన్‌చార్జిని నియమించడంతోనే సమసిపోతాయన్నారు. ఇన్‌చార్జి ప్రక్రియ ప్రారంభించామని చాలా వరకు అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. శాసన మండలి మాజీ సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇన్‌చార్జి సమస్యకు త్వరలో పరిష్కారం దొరుకుతుందని అన్నారు.

గుండెపోటుతో మెప్మా ఆర్పీ మృతి



ముమ్మిడివరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ మెప్మా విభాగంలో రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న మాదేటి రామలక్ష్మి(47)గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. నగర పంచాయతీ పల్లిపాలేనికి చెందిన రామలక్ష్మి బుధవారం ఉదయం ఇంటి వద్ద వంట చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందారు. ఆమెకు భర్త ధర్మరాజు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామలక్ష్మి మృతిపట్ల పలువురు మెప్మా విభాగ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

అమలాపురంరూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లి జాతీయ రహదారిపై ఈనెల2న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అమలాపురం మండలం ఎ.వేమవరం గ్రామానికి చెందిన నలబ శ్రీదేవి(20) బుధవారం ఉదయం మృతిచెందినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఈనెల2న ఆటోను ఐషర్ వ్యాన్‌వేగంగా వచ్చి ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌తో సహా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటనలో శ్రీదేవి తలకు బలమైన గాయం కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శ్రీదేవి మృతిచెందినట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. పదో తరగతి వరకు చదువుకున్న శ్రీదేవికి వివాహంచేసేందుకు తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్న సమయంలో బిడ్డ మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

తహశీల్దారును డీడీవోగా నియమించాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులకు తహశీల్దార్ డీడీవోగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దారు జె.వెంకటేశ్వరికి వీఆర్వోలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ గ్రామసచివాలయ ఉద్యోగులను మూడు కేటగిరిలుగా విభజించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. గ్రామరెవెన్యూ అధికారులందరికి గ్రేడ్లు తొలగించి అందరికి తహశీల్దారు డీడీవోగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసచివాలయ రేషనలైజేషన్‌లో భాగంగా రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు గిడ్డి రమణ, ప్రధాన కార్యదర్శి జి.నాగలక్ష్మి, గౌరవ అధ్యక్షుడు వి.రామకృష్ణ, యుసుకపూడి రమేష్ పాల్గొన్నారు.

మండపేట



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

వెంకన్న ఒకరోజు ఆదాయం రూ.1.76 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,76,847 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఘనంగా లక్షతులసీ పూజ

ఆత్రేయపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి క్షేత్రపాలకుడు గోపాలస్వామి లక్షతులసీ పూజను ఘనంగా జరిపారు. బుధవారం ఆలయంలో స్వామివారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహ వచనం, మండపారాధన, కలశపూజ, స్వామివారికి అభిషేకం, బాలభోగం తదితర కార్యక్రమాలను అర్చక బృందం ఘనంగా జరిపారు. లక్షతులసీ పూజ, శాంతి హోమం, కల్యాణం కార్యక్రమాలు అశేష భక్తజనం మధ్య వైభవంగా చేశారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణ మూర్తి వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందించారు.



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో జరిగిన లక్షతులసి పూజ



కుష్ఠు వ్యాధిగ్రస్తులకు సామగ్రి అందిస్తున్న దృశ్యం

జిల్లాలో 77 మంది కుష్ఠు రోగుల గుర్తింపు

కె.గంగవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనవరి నాటికి 77 కొత్త కేసులు గుర్తించినట్లు జిల్లా డిప్యూటీ పారా మెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం పామర్రు ఆసుపత్రి వద్ద స్పర్శ కార్యక్రమంలో భాగంగా ఆశ వర్కర్‌లతో సమావేశం జరిపారు. జిల్లాలో 1,035 మంది రోగులు ఉన్నారని తెలిపారు. స్పర్శ ప్రోగ్రాం ఈనెల 13 వరకు పొడిగించినందున ఆశ వర్కర్‌లు ఇంటింట సర్వే చేసి రోగులను గుర్తించాలన్నారు. ఎల్పీడీపీ సర్వేలో 11 మందిని గుర్తించామని చెప్పారు. కుష్ఠు రోగులకు ప్రత్యేకంగా తయారు చేసిన పాద రక్షలు, అల్సర్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పామర్రు ఆసుపత్రి వైద్యులు విష్ణువర్ధన్, పి.హర్షిత, ఎంపీహెచ్‌వో ఎంఎస్ఎన్ రెడ్డి, నోడల్ పర్సన్ సుబ్బారావు, జిల్లా నోడల్ అధికారి సీహెచ్ సూర్యారావు, ల్యాబ్ టెక్నీషియన్ త్రిమూర్తులు, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారుల తీరుపై అసంతృప్తి

ఆలమూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు సాగునీరు అందించే కాల్వకు ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో వ్యర్థాలతో నిండిపోయి సాగునీటి సరఫరాకు ఆటంకంగా మారిందని చింతలూరు సాగునీటి సంఘ అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి ఆరోపించారు. జొన్నాడ- వెదురుమూడి మీడి యం కాల్వలో పూడికతీత పనులను ఆయన పర్యవేక్షించారు. మురుగు కాల్వ కంటే అధ్వానంగా మారిన తీరును చూసి ఆయన అధికారు లపై మండిపడ్డారు. విద్యుత్‌శాఖ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పేరిట తొలగించిన చెట్టు కొమ్మలను కాల్వలోకి పారేశారని వాటిపై అధికారులకు తాను ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. ఉపాధి కూలీలతో పూడిక తీత పనులు చేయించటం తనకెంతో మనోవేదన కలిగిస్తోంద న్నారు. తమనేత బండారు శ్రీనివాస్ సహకారం తో ఇరిగేషన్ కాల్వ రూపు రేఖలు మార్చే వరకు విశ్రమించేది లేదని ఆయన అన్నారు.



పంటకాల్వలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న నీటి సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్



పురస్కారం అందుకుంటున్న వేంకటేశ్వరరావు

తెలుగుతేజం పురస్కారం అందజేత

ఆలమూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వేదికగా జరిగిన గోదావరి ఉత్సవ్‌లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానానికి చెందిన తోట వేంకటేశ్వరరావుకు తెలుగుతేజం జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. సత్యమేవ జయతే అసోసియేషన్ స్థాపనతో పాటు ఆ సంస్థ ద్వారా పలు వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలకు ఈ పురస్కారాన్ని అందించినట్లు అద్దంకి రాజా తెలిపారు. రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గజల్ కళాకారుడు గజల్ శ్రీని వాస్, శాసనమండలి సభ్యులు బొర్రా గోపి మూర్తి, కత్తిమండ ప్రతాప్, సాన్ ఇండియన్ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా నుంచి వేంక టేశ్వరరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

కిశోర వికాసంపై అవగాహన

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టేకి త్రి అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డే జరిపారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎ.గజలక్ష్మి పలు అంశాలపై తల్లులకు వివరించారు. అనంతరం టేకి జడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర బాలలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఐ.మాణిక్యం, పి.వెంకటలక్ష్మి, టివోటీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.



కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో గజలక్ష్మి

భక్తులను ఆకట్టుకుంటున్న స్వాగతద్వారం

మామిడికుదురు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి దేవస్థానానికి వెళ్లే మార్గంలో పాశర్లపూడి కొండాలమ్మచింత వద్ద లైటింగ్‌తో ఏర్పాటుచేసిన స్వాగత ద్వారం ఆకట్టుకుంటుంది. కొండాలమ్మచింత సెంటర్‌లో స్వాగత ద్వారంపై రెండు వైపులా శంఖు చక్రాలతో వేంకటేశ్వరస్వామి సాక్షాత్కరిస్తున్న దృశ్యం భక్తుల మనసులను రంజింప చేస్తుంది. రాత్రి సమయాల్లో మిరుమిట్లు గొలిపే లైటింగ్‌తో భక్తులను ఆకర్షిస్తూ ఈవిధంగా స్వాగత ద్వారం ఏర్పాటుచేశామని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

11న శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

కె.గంగవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కోటిపల్లిలో శివరాత్రి ఉత్సవాలపై 11న సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో జే.భీమశంకరం తెలిపారు. ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు ఉత్సవ కమిటీ చైర్మన్, రామచంద్రపురం ఆర్డీవో అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులంతా హాజరుకావాలన్నారు.

రోడ్డు ఇలా ఉంటే...ప్రయాణం సాగేదెలా ?

• మండపేట-ఏడిద రహదారి దుస్థితిపై ప్రయాణికుల ఆగ్రహం • భారీ గోతులతో నరకాన్ని తలపిస్తున్న వైనం



రాళ్లులేచి అధ్వానంగా మారిన మండపేట-ఏడిద రహదారి

మండపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని రహదారులు వాహనదారులకు నరకాన్ని చూపించాయి. తరచూ రోడ్డు ప్రమాదాలకు చిరునామాగా మారినా వైసీపీ పాలనలో కనీస మరమ్మతులు కూడా చేయలేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా మండ పేట నియోజకవర్గంలో రూ.5.5 కోట్లతో రహ దారుల మరమ్మతులు చేపట్టారు. సంక్రాంతి లోపు రహదారులపై ఎక్కడా గోతులు ఉండ కూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించినా ఫలితం కన్పించలేదు. మండపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు రహదారుల మరమ్మతులు పూర్తికాలేదు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండపేట-ఏడిద-దుళ్ల రోడ్డు ఏడు కిలోమీటర్ల మేరకు చేపట్టిన మరమ్మతులు ముందుకు సాగడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ గోతులతో పాటు, రాళ్ల లేచిపోవటంతో ప్రజలు నిత్యం నరకయాతన చవిచూస్తున్నారు. కేశవరం-ద్వారపూడి మధ్య కెనాల్ రోడ్డు మరమ్మతులు ముందుకు సాగడం లేదు. కపిలేశ్వరపురం-అంగర మధ్య చేపట్టిన పనులు నత్తనడక కొనసాగుతున్నాయి. ఇప్పనపాడు-మెర్నిపాడు మధ్య ఏడు కిలోమీటర్ల మేర పనులు కూడా అంతంత మాత్రంగా నడుస్తున్నాయి. రహదారుల పనులకు టెండర్లు పిలిచినా వీటి కాంట్రాక్టర్లు వేగంగా చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదా రులు నత్తనడకన జరుగుతున్న విషయంపై రామచంద్రపురం ఇన్‌చార్జి డీఇఇ సూర్యనారాయణను వివరణ కోరగా నియోజకవర్గంలో రూ.5.5 కోట్లతో రహదారి మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కొన్ని చోట్ల పనులు నత్తనడకన జరుగుతున్న మాట వాస్తవమేనని తెలిపారు. వీటి పనులు 15 రోజుల వ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసు కుంటామన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్ లకు నోటీసులు జారీ చేస్తామని ఆయన చెప్పారు.



ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

నాయకుల ఫ్లెక్సీల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రావులపాలెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో నాయకుల ఫ్లెక్సీలు తొలగించకపోవడంపై కోడ్ ఉన్నట్టా.. లేనట్టా...! శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు బుధవారం నాయకుల ఫ్లెక్సీల తొలగింపును చేపట్టారు. మండల పరిధిలోని గోపాలపురంతో పాటు అన్ని గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన సదస్సు

కె.గంగవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన సదస్సు నిర్వ హిస్తున్నట్లు వ్యవసాయశాఖ మండల అధికారి బలుసు రవి తెలిపారు. ఎలుకల నిర్మూలన మందును గురువారం పంపిణీ చేస్తామన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జి తదితరులు

వైసీపీ ఫీజుపోరు హాస్యాస్పదం

కొత్తపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ చేయడానికి చేతులు రాని జగన్‌రెడ్డి అధికారం పోయిన తరువాత ఫీజు పోరు చేపడతామనడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ అధికార జిల్లా ప్రతినిధి ముత్యాల బాబ్జి పేర్కొన్నారు. వైసీపీ పాలనలో విద్యార్థులకు రీయంబర్స్‌మెంట్ చేయకుండా కోట్లాది రూపాయలు బకాయిలు పెట్టారన్నారు. అప్పట్లో వాటి కోసం విద్యార్థులు రోడ్డెక్కితే లాఠీ చార్జ్ చేయించారని ఆయన ఆరోపించారు. బకాయిల మూలంగా విద్యార్థులకు ఆయా కళాశాలల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మేలు చేయని జగన్‌రెడ్డి ఇప్పుడు విద్యార్థుల ఫీజు పోరు పేరుతో రోడ్లపైకి రమ్మనడం ఎంత వరకు సమంజసమన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి యల్లమిల్లి జగన్మోహన్, కొత్తపేట నీటి సంఘం అధ్యక్షుడు బండారు వీరబాబు, శీలం సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి


రావులపాలెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చిన్నారులపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమశ్రీ అన్నారు. రావులపాలెంలో చిన్నారుల తల్లులకు కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా హిమశ్రీ మాట్లాడుతూ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో గంగావతి, వై.రాణి, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్‌వోలు) అందరికీ గ్రేడ్‌లను తొలగించి వారికి డీడీవోగా తహశీల్దార్ ఉండేలా చర్యలు తీసుకోవాలని వీఆర్‌వోల మండల కమిటీ అధ్యక్ష గౌరవ అధ్యక్షులు జి.ఉమామహేశ్వరరావు, వై.రాజారత్నం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తహశీల్దార్ పి.చిన్నారావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండలంలోని వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



వాలిన విద్యుత్ స్తంభంతో పొంచి వున్న ముప్పు

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేట-ఆలమూరు రోడ్డులో వున్న బీఎస్ఎన్ఎల్ భవన సముదాయం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న కరెంట్ స్తంభం వొంగిపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం జనంతో ఉండే ఇక్కడి సెంటరులో వున్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అనుకోని ప్రమాదం జరగక ముందు దీన్ని యుద్ధ ప్రాతి పదికన తొలగించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుబజార్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేటలో రైతుబజారును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండపేట రైతుబజార్‌ను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తనిఖీ చేశారు. రైతు బజారు దుకాణాలను పరిశీలించిన ఆయన కూరగాయలు ధరలు, నాణ్యతపై వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి సమస్యలపై తన దృష్టికి తీసుకురావాలని ఆయన రైతులను కోరారు. రైతుబజారు నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జె.సూర్యారావు, పి.గణపతి, వంకామణి, గడి రాంబాబు, రైతుబజార్ అధికారి బి.సతీష్ కెఎస్ఎన్ తదితరులు వున్నారు.

ఎమ్మెల్యే పరామర్శలు

ఇటీవల మండలంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. మండపేటకు చెందిన పిల్లి మేరి, అడపా రాజమ్మ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మండపేట మండలం ఆర్తమూరుకు చెందిన కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, ఏడిద కొత్తూరుకు చెందిన పలవెల బాలరాజు, కుటుంబ సభ్యులు ఆయన పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు నల్లమిల్లి వీర్రెడ్డి, పి.ప్రదీప్, వీరబాబు, ఎం.అదినారాయణ, దూళి జయరాజు, ఎం.సూరిబాబు, గంగరాజు, చిర్ల చంద్రారెడ్డి తదితరులు వున్నారు.

‘రాజశేఖర్ గెలుపునకు మద్దతు కూడగట్టండి’



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను కలసి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని సూచించాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ అన్నారు. బుధవారం లయన్స్ కల్యాణ మండపంలో బూత్ ఇన్‌చార్జిలు, కూటమి నాయకులతో సమావేశం జరిపారు. ఆయన మాట్లాడుతూ పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించుకోవాలని అన్నారు. బూత్ ఇన్‌చార్జిలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని అన్నారు. సమావేశంలో రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, బూత్ ఇన్‌చార్జిలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసంశెట్టి సత్యం

13న మెగా సాఫ్ట్‌వేర్ జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో 13న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా సాఫ్ట్‌వేర్ మేళా నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. బుధవారం వీఎస్ఎం కళాశాలలో మెగా సాఫ్ట్‌వేర్ జాబ్‌మేళాకు సంబంధించి పోస్టర్‌ను వాసంశెట్టి సత్యం, వీఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ కె.బాలాజీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సత్యం మాట్లాడుతూ జాబ్‌మేళాకు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్, పూణే, ఢిల్లీ ప్రాంతాల నుంచి పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు 300 మందికి ఉద్యోగాలు కల్పిస్తాయని తెలిపారు. ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ప్యాకేజీ ఉంటుందన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అర్హులైన బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్ తదితర గ్రూపుల్లో ఉత్తీర్ణులైన వారంతా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో ఇంటర్, డిగ్రీ, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికి కూడా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు.



డాక్టర్ వెంకటరమణను సత్కరిస్తున్న మోడరన్ అధినేత లయన్ జీవీ రావు

విద్యార్థులు సానుకూల అవకాశాలతో ముందుకెళ్లాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మోడరన్ జూనియర్ కళాశాల వైబ్స్ ఫేర్‌వెల్ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సత్య స్కానింగ్ అధినేత డాక్టర్ కాద వెంకట రమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవరచుకుంటే విజయాన్ని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించడానికే ప్రతీ ఏడాది కాలేజీ ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సి.హెచ్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్ ఇన్‌చార్జి డీఈఈగా సూర్యనారాయణ

మండపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండపేట పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ ఇన్‌చార్జి డీఈఈగా కొత్తపేట పీఆర్ డీఈఈగా పనిచేస్తున్న ఏవీ సూర్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండపేట పీఆర్ డీఇఇగా పనిచేసిన రామనారాయణ జనవరిలో ఉద్యోగ విరమణ చేయటంతో ఆయన స్థానంలో కొత్తపేట డీఈఈని మండపేట పీఆర్ డీఈఈగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



రాయవరంలో బసవేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా బసవేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

రాయవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాయవరంలోని బసవేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిపారు. దేవాంగ బసవేశ్వరస్వామి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. గ్రామానికి చెందిన అర్చకుడు కాళ్లూరి సత్యనారాయణ శర్మ అర్చకత్వంలో బసవేశ్వరస్వామికి, పార్వతి పరమేశ్వరులకు అర్చనలు, హారతులు జరిపారు. అనంతరం జరిగిన అన్నదానంలో అధికసంఖ్యలో ప్రజలు హాజరుకాగా, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడు మృతికి సంతాపం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కోరం వెంకట్రావు(61) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. పారిశుధ్య పనులు నిర్వహించేందుకు వచ్చిన ఆయన అస్వస్థతకు లోనుకావడంతో ఇంటికి పంపించి వేశారు. కొద్దిసేపటి తర్వాత ఆయన మృతి చెందినట్టు సర్పంచ్ సాకా శ్రీనివాస్ తెలిపారు. వెంకట్రావు అకాల మరణం పట్ల సర్పంచ్‌తో పాటు, గ్రామ కార్యదర్శి కె.శివచక్రవర్తి, పంచాయతీ పాలకవర్గం, సచివాలయ ఉద్యోగులు తదితరులు సంతాపం తెలిపారు.



ఎస్‌బీఐ అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

జడ్పీ హైస్కూల్‌కు ఫర్నీచర్ అందజేత

ఆలమూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) రాజమహేంద్రవరం రీజనల్ కార్యాలయం చెముడులంక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బుధవారం ఫర్నీచర్ అందజేసింది. విద్యార్థులకు అవసరమైన బెంచీలు, రెండు కంప్యూటర్‌ల తోపాటు నాలుగు బీరువాలు, టేబుళ్లు, కుర్చీలు, మైక్ సిస్టమ్ వంటివాటిని అందించారు. రీజనల్ మేనేజర్ టి.శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం భమిడిపాటి శివరామకృష్ణకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్ఎం శ్రీనివాస్ మాట్లాడారు. పాఠశాలకు ఫర్నిచర్‌ను అందజేసిన బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌బిఐ హెచ్‌ఆర్ మేనేజర్ పవన్‌కుమార్, చెముడులంక బ్రాంచి మేనేజర్ వెంకట రమణలను హైస్కూల్ హెచ్‌ఎం శివరామకృష్ణ సారథ్యంలో పలువురు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీ తమ్మన భాస్కరరావు, పాఠశాల పీసీ, కమిటీ చైర్మన్ నాగిరెడ్డి రాము, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తిర్నాతి వేంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి రాంబాబు, పాలూరి అర్జున్, నాగిరెడ్డి సత్యానందం, జి.రాంబాబు, ఉంగరాల బాబులు, లంకలపల్లి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.